

# సాహితీమూర్తుల సహవాసం
## – నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

# నేను రాసిన పత్రికలు - నాకు తెలిసిన ఎడిటర్స్

# 1

# ప్రజావాణి - వట్టికొండ రంగయ్య (1913-98)


ప్రజావాణి

సంపాదకుడు: వట్టికొండ రంగయ్య

దుబారా చేయడాన్ని ప్రతిఘటించండి దేశ సంపదను వృథా కానీయకండి

సంపుటి 12 సంచిక 40 ఆదివారం 12-5-1963 గుంటూరు వెల 12 నయా పైసలు

పత్రికా రంగంలో నా రంగ ప్రవేశం `ప్రజావాణి` వారపత్రికతో వట్టికొండ రంగయ్య సంపాదకత్వాన గుంటూరు లో 1954 లో మొదలైంది.ఆనాటి పరిస్థితి గమనిస్తే:--1952 నాటికి మదరాసు నుండి చీలిపోయి ప్రత్యేక ఆంధ్ర ఏర్పడింది. ఆనాడు పత్రికలు చాలా ఉధృతంగా వస్తుండేవి. అన్నాప్రగడ కామేశ్వరరావు ఎడిటర్ గా `అంకుశం`, గోరాశాస్త్రి ఎడిటర్ గా `తెలుగు స్వతంత్ర`, సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి ఎడిటర్ గా `తెలుగుదేశం`, బండి బుచ్చయ్య ఎడిటర్ గా `ములుకోల`, తాపీ ధర్మారావు ఎడిటర్ గా `జనవాణి`, ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎడిటర్ గా `రాడికల్`, ఇంకా పార్టీవారీగా అనేక వార, పక్ష, మాసపత్రికలు వస్తుండేవి. అలాంటి నేపథ్యంలో వట్టికొండ రంగయ్య `ప్రజావాణి` వారపత్రిక నడిపారు. గుంటూరులో తాత్కాలిక హైకోర్టును పెట్టారు. రాజకీయోద్యమాలకి, ప్రజా

ఉద్యమాలకు, విద్యార్థి సంఘాల కార్యకలాపాలకు గుంటూరు, ప్రధాన కేంద్రంగా ఉండేది. కొత్త పత్రికలు తలెత్తాయి. రంగయ్య తెనాలిలో చదివి, తరువాత కాలేజీ డిగ్రీ స్వీకరించి, మద్రాస్ లో కొద్ది రోజులు `ఆంధ్రప్రభ`లోనూ, వెలిసి ఆగి పోయిన `విజయప్రభ` దినపత్రికలోనూ పనిచేసారు. భాషాసమితిలోనూ, సినీ రంగంలోనూ అతి కొద్ది రోజులు పనిచేసి, పత్రికారంగంలో ఇమిడిపోయారు.

సంజీవ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్నప్పుడు` కాంగ్రెస్` పత్రిక నడిపి, ఆయనతో పేచీ రాగా, పత్రిక మూసి వేసి సామానుతో సహా గుంటూరు తరలి, ప్రజావాణి వారపత్రిక 1954లో ప్రారంభించి 15 ఏళ్ళు నడిపారు.



వట్టికొండ రంగయ్య కృష్ణాజిల్లా వీరులపాడుకు చెందినవాడు. ఆ వూరంతా ఆనాడు కమ్యూనిస్టుల మయం. మరొకరికి చోటు పెట్టేవారు కాదు. 1946 ప్రాంతాలలో పరిమిత ఎన్నికలు జరిగినప్పుడు శాసన సభకు రాడికల్ డెమోక్రటిక్ పార్టీ కూడా పోటీ చేసింది. వాళ్ళ అభ్యర్థి తరపున వీరులపాడులో ఎన్నికల సభ పెట్టబోగా ఊళ్ళో కమ్యూనిస్టులు అడ్డుకున్నారు. మల్లాది రామమూర్తి, గుత్తికొండ నరహరి ప్రసంగించవలసి ఉన్నది. అప్పుడు ఆ ఊరుకు చెందిన వట్టికొండ రంగయ్య ధైర్యంగా నిలబడి, `స్వేచ్ఛగా సభ జరుపుకోనివ్వాల`ని కమ్యూనిస్టులతో వాదించి ఆనాడు సభ జరగటానికి తోడ్పడ్డారు. రంగయ్య అభ్యుదయ భావాలుగల మితవాద రచయిత. గేయాలు, కథలు, రాశారు. 'మధూదయం' అనే ఖండకావ్యం, రంగకవీయం, విప్లవ జ్వాల అనే గేయ సంపుటి ప్రచురితమయ్యాయి. చదలవాడ పిచ్చయ్య ప్రారంభించిన అభ్యుదయ రచయితల సంఘంలో చురుకుగా సభ్యత్వం వహించిన రంగయ్య అభిప్రాయ భేదాల వలన రాజీనామా చేసి (1943), స్వతంత్రంగా వ్యవహరించారు.

గుంటూరు నుండి కొత్తగా వెలువడిన `ప్రజావాణి` జనాకర్షణ పొందింది. అందులో మొదటి పేజీలో బి.ఎస్.ఆర్. కృష్ణ ప్రతివారం `శైలేంద్ర` పేరిట రాజకీయ వ్యాఖ్యానాలు చేసేవారు. నల్లమోతు సత్యనారాయణ, వాసిరెడ్డి సత్యనారాయణ, దరువూరి వీరయ్య, ఇంకా ఎందరో యువ రచయితలు ఆ పత్రికకు రాసేవారు. 1953 చివరలో నాకు ఆ పత్రికతో పరిచయం అయింది. గుంటూరు ఎ.సి.కాలేజీలో ఇంటర్మీడియేట్ చదువుతూ రచనా ప్రయోగానికి పూనుకున్నాను. నా తొలి రచన `అనంతశయనం అయ్యంగారి అనంతకోటి రూపాలు` అనే పేరిట రాజకీయ వ్యాఖ్యానం పంపించాను. అది మొదటి పేజీలో వెయ్యటం నాకెంతో సంతోషాన్నిచ్చింది. వరుసగా పత్రికకు రాయటం మొదలుపెట్టాను. ఒక ఏడాది తిరిగేలోపు నేను ఆర్థిక ఇబ్బందులకు గురయి చదువు మానేయాల్సి వచ్చింది. మా అన్న విజయరాజకుమార్ సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి, ఆరునెలల పాటు రాజమండ్రి జైలుపాలయ్యాడు. అప్పుడు నేను వట్టికొండ రంగయ్య దగ్గరకు వెళ్ళి పత్రికలో పనిచేస్తానని కోరగా ఆయన అంగీకరించి ఉద్యోగం ఇచ్చారు. అప్పట్లో మేము గుంటూరు వారి తోటలో వుండేవారం. ఆ తరువాత పాత గుంటూరుకు మారాం. `ప్రజావాణి` ఆఫీసు అరండల్ పేట నాలుగవ లైన్ లో ఉండేది. రంగయ్యగారి ఇల్లు బ్రాడీపేట నాలుగవ లైన్ లో ఉండేది. నేను రోజూ ఉదయమే నడిచి రంగయ్యగారింటికి వెళ్ళి, ఆయనను, ఆయన భార్య విశాలాక్షిని కలిసేవాడిని. అక్కడ నుండి ఇద్దరం శంకర విలాస్ కు వచ్చి రెండు ఇడ్లీ తిని, కాఫీతాగి ఆఫీసుకు చేరేవాళ్ళం. ఇది నిత్యకృత్యంగా ఆరు మాసాలపాటు జరిగింది. రంగయ్య నాకు ఎన్నో విషయాలు చెపుతుండేవాడు. ఇంటిదగ్గర ఆయన భార్య విశాలాక్షి కబుర్లు చెప్పేది. ఆమె రచయిత్రి. కథలు గేయాలు నాటకాలు నవలలు రాసేది. ప్రజావాణిలో అవి సీరియల్ గా వస్తుండేవి. విశాలాక్షి మా చేబ్రోలుకు చెందిన రచయిత్రి. మా వూరు కూడా అదే కావడం వలన కొంత సన్నిహితత్వం పెరిగింది. ప్రజావాణిలో ప్రూఫ్ రీడింగ్ రంగయ్యే చేసేవాడు. గార్డన్ ప్రెస్ లో పత్రిక చాలా ముచ్చటగా అచ్చయ్యేది. నేను నా రచనలతోపాటు ఇతరుల రచనలు పరిశీలించటం, విషయ సేకరణ చేయటం, నిత్యకృత్యంగా ఉండేది. `స్క్రీన్,` `ఫిల్మ్

ఇండియా` పత్రికల నుండి ఆసక్తికరమైన సినిమా సంగతులు సేకరించి ఒక పేజీ నింపేవాళ్ళం. ఆ రోజులలో బాబూరావు పటేల్ నిర్వహించిన సినిమా పత్రిక ఘాటైన విమర్శలతో ఆకర్షణీయమైన కార్టూన్లతో బొంబాయి నుండి వెలువడేది. దానిలోనుండి సేకరించిన విషయాలకు కాపీరైట్ ఏమీలేదు.

రాజకీయ వ్యాఖ్యలలో కమ్యూనిస్టు వ్యతిరేకత, కాంగ్రెస్ అనుకూలత ప్రజావాణిలో వుండేవి. 1955 మధ్యంతర ఎన్నికలు జరిగినపుడు కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి మద్దుకూరి చంద్రశేఖరరావుకు, వట్టికొండ రంగయ్యకు పత్రికా ముఖంగా హోరాహోరీ పోరాటం జరిగింది. పత్రిక ఆకర్షణకు అది కూడా ఒక ఆయుధంగా ఉండేది.

ఆరునెలల తరవాత నేను `ప్రజావాణి`లో ఉద్యోగం మానేశాను. అప్పటివరకూ రోజుకు ఒక రూపాయి చొప్పున రంగయ్య నాకు చెల్లించేవాడు. ఆనాడు రూపాయికి చాలా విలువుండేది. ఇంట్లోకి కావలసిన కనీస సరుకులు వచ్చేవి. ఆ విధంగా మా అన్న జైల్లో ఉన్నపుడు నేను ఆ వయసులోనే కుటుంబాన్ని ఆదుకోగలిగాను. అన్న జైలు నుంచి తిరిగి వచ్చిన తరవాత మళ్ళీ ఎ.సి. కాలేజీలో నా చదువు కొనసాగించాను. అయితే పత్రికా రచన మాత్రం మానలేదు. `ప్రజావాణి`లో ఇంచుమించు పదేళ్ళపాటు రచనలు, అనువాదాలు ప్రచురించాను. ఎమ్.ఎన్.రాయ్ రచనలు ముఖ్యంగా "పార్టీలు, అధికారం, రాజకీయాలు" అనువదించాను. అయితే నా రచనలకు ఆయన డబ్బేమీ ఇచ్చేవాడు కాదు. నేను కూడా ఆశించలేదు. రాను రాను రంగయ్యతో కలియడం తగ్గిపోయింది. ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా ఏమీ లేవు. 1965 ఆ ప్రాంతాలలో `ప్రజావాణి` ఆగిపోయింది. స్థానిక రచయితలెందరినో ప్రోత్సహించి పత్రికలో స్థానం కల్పించిన రంగయ్య గుంటూరులోనే స్థిరపడి అక్కడే చనిపోయారు. విశాలాక్షిమాత్రం ఆయన తదనంతరం రచనలు కొనసాగించారు. వారికి సంతానం లేదు. సుదక్షిణా దేవిని పెంచుకొని పెళ్ళి చేశారు. ఆమె `విశాలాక్షి సాంస్కృతిక సంఘం` పేరిట ఏటా సాహితీపరులకు అవార్డులిస్తున్నారు. ఆయన ఎక్కువగా రాజకీయ రచనలకే పరిమితమయ్యారు.


బేసిక్ విద్యావిధానం విఫలమైందని, ఆవిధానాన్ని ఆరంభించిన శ్రీ జకీర్ హుస్సేన్, విద్యావేత్త కాన్వే, నేటి విద్యా మంత్రి డాక్టర్ శ్రీమాలి ప్రభృతులు అంగీకరించారు. శ్రీమాలి గారు మాత్రం ఒక కొత్త సూత్రం కనిపెట్టారిటీవల. బేసిక్ విద్యావిధానం విఫలం కావటానికి అధ్యాపకులు సరైనవారు లేకపోవటమే కారణమనీ, కనుక మూడవ ప్రణాళికలో ట్రైనింగ్ బాగా యివ్వబోతున్నామనీ వెల్లడించారు. అంటే యింకా గాంధిగారి

శ్రీ శూలపాణి

ఆత్మ వీళ్ళను వదల్లేదన్నమాట! విఫలం కావటానికి ఉపాధ్యాయులే కారణమా? బేసిక్ సూత్రాలు మంచి లక్ష్యానికి ఉద్దేశించిన వేనా? 18 ఏళ్ళలోపు పిల్లలు స్వయం

ఉన్నది.

శిక్షణ కనీసం మూడు సంవత్సరాలైనా ఉండాలి. మొదటి సంవత్సరం శిక్షణ పద్ధతులు నేర్చుకొని, రెండవ సంవత్సరమంతా ఏదో ఒక పాఠశాలలో వాటిని అమలు పరచి, ఫలితాల్ని రికార్డు చేసుకొని, సాధ్యాసాధ్యాలు, కష్టతరమార్గాలు చూచుకొని, వాటిని ట్రైనింగ్ అధ్యాపకులకు నివేదించి, తదనుగుణంగా మూడో సంవత్సరం ఆచరణ సాధ్యమైన శిక్షణ పొందాలి. శిక్షణ తరగతులు కేవలం ఉపన్యాసాలతో గాక. చర్చ, ప్రశ్నలు, స్వేచ్ఛగా మాట్లాడుకోనడం; యీ పద్ధతులపై ఉండాలి. ట్రైనింగ్‌కు ప్రభుత్వ పరీక్షలు అసలు ఉండకూడదు. సంవత్సరం పొడవునా శిక్షితుని రికార్డు ననుసరించి ఫలితం నిర్ణయించాలి. పనికిరాని బేసిక్ సూత్రాల అమలుకు వృథా ఖర్చుచేసే

ప్రజావాణిలో నేను మొదట `అనంతరాజకుమార్` అనే పేరుతో రాశాను. అది మానేసి `ఎన్. శూలపాణి` అనే పేరుతో వ్యాసాలు రాశాను. అది మారుపేరయినప్పటికీ ఆ విధంగా రాయటం వల్ల నిజమైన పేరే అని చాలామంది అనుకునేవారు. కొన్ని వ్యాసాలను నా మిత్రుడు శిద్ధాబత్తుని రామకృష్ణతో కలిసి రాశాను. అతను ఎ.సి. కాలేజీలో నాకు మిత్రుడు. సాహిత్యంలో చురుకైనవాడు. పాఠ్యగ్రంథాలను జాతీయం చేయటం పట్ల అభ్యంతరాలు తెలియజేస్తూ కొన్ని వ్యాసాలు ప్రచురించాము. విశ్వనాథ సత్యనారాయణ రాసిన పాఠ్యాంశాలను తీవ్రంగా నిరసించాము. బుద్ధుణ్ణి రాక్షసుడిగా చిత్రించటాన్ని 5వతరగతి పాఠ్య పాఠాలలో పెట్టినపుడు ఈ విమర్శలు చేశాము. మా విమర్శల పట్ల కాటూరి వెంకటేశ్వరరావు (సౌందరనందం రచయిత) మెచ్చుకోవడం మాకు గర్వకారణమయింది. మిత్రుడు రామకృష్ణ రేపల్లెకు చెందిన శిద్ధాబత్తుని దుర్గయ్య కుమారుడు. చురుకైన, ఘాటైన విమర్శలు చేసేవాడు. అతనితో కలిసి జంటరచయితగా కొన్నాళ్ళు మాత్రమే రాశాము.

మానవవాద రచయితల ప్రత్యేక వ్యాసాలూ, ఎమ్.ఎన్.రాయ్, శిబ్ నారాయణ్ రే రచనలూ, అనువదించి ‘ప్రజావాణి’లో ప్రచురించాను. రాజగోపాలాచారి, కె.ఎం. మున్షి హైందవ ప్రచారధోరణులను విమర్శిస్తూ వ్యాసాలు రాశాను.

●●●

(మరో సాహితీమూర్తితో సహవాసం గురించి వచ్చే సంచికలో)

COMMENTS